క్లుప్తంగా

వీధి కుక్కల పట్టివేత



గూడూరులో వీధి కుక్కలను పట్టుకుంటున్న నగర పంచాయతీ సిబ్బంది

కోడుమూరు రూరల్: గూడూరు నగర పంచాయతీ పరిధిలోని కాలనీల్లో శుక్రవారం నుంచి సిబ్బంది వీధికుక్కల పట్టివేత కార్యక్రమాన్ని చేపట్టారు. మున్సిపల్ చైర్మన్ జులపాల వెంకటేశ్వర్లు, కమిషనర్ రమేష్‌బాబు స్వయంగా వీధికుక్కల పట్టివేత కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నగర పంచాయతీ పరిధిలో వీధి కుక్కల బెడద పెరిగిపోయిందన్నారు. సమస్యను పరిష్కరించేందుకు నగర పంచాయతీ పరిధిలో రోజుకు 20 వీధికుక్కలను పట్టుకెళ్లి వాటికి కర్నూలులో స్టెరిలైజేషన్ చేయడంతో పాటు, యాంటీ రాబీస్ వాక్సిన్‌లను వేయనున్నట్లు తెలిపారు. తర్వాత యథావిధిగా ఆయా కాలనీల్లో వదిలేస్తామని చెప్పారు.

చిరుత పులుల కలకలం

గడివేముల: మండలంలోని గని గ్రామ సమీపంలోని పంట పొలాల్లో శుక్రవారం రెండు చిరుత పులులు కనిపించాయి.గొర్రెల కాపరులు గమనించి సెల్‌ఫోన్‌లలో వాటిని ఫొటో తీసి గ్రామ సర్పంచ్ తులసమ్మకు సమాచారమిచ్చారు. ఆమె వెంటనే ఫారెస్ట్ అధికారులకు తెలియజేశారు. చిరుత పులులు సంచరించే ప్రదేశాల్లో వెళ్లవద్దని రైతులకు , గొర్రెలు మేపుకునే నిర్వాహకులకు ఈ సందర్భంగా ఆమె సూచించారు. చిరుతపులను బంధించి నల్లమల్ల ఫారెస్ట్‌లో వదలాలని ప్రజలు కోరుతున్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

కల్లూరు: కల్లూరు గ్రామీణ, అర్బన్ ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ ఆంజనేయులు పరిశీలించారు. మండలంలోని 1200 ఓటర్లకు మించిన పోలింగ్ స్టేషన్లను పరిశీలించారు. అవసరమైన చోట్ల కొత్త పోలింగ్ స్టేషన్లు ఏర్పాటుకు ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వనున్నట్లు తహసీల్దార్ తెలిపారు.

అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే

కల్లూరు: పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి కర్నూలు మాధవి నగర్ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి సమస్యలపై వినతిపత్రాలు స్వీకరించారు. తర్వాత నంద్యాల రోడ్డులోని ఓ ఫంక్షన్ హాల్‌లో సుపరిపాలనలో తొలి అడుగు సమీక్ష సమావేశం నిర్వహించారు.

2న మండల మీట్

పాణ్యం: వచ్చే నెల 02వ తేదీన మండల మీట్ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ప్రభుత్వ శాఖల అధికారులు తప్పక హాజరు కావాలన్నారు. గత మూడు నెలల ప్రగతిని తయారు చేసి అందించాలన్నారు. ఉదయం 11గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు.


విద్యార్థుల భవిష్యత్‌కు బంగారుబాట వేయాలి



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న హెచ్‌ఎం రామచంద్రారెడ్డి

ఓర్వకల్లు: ఉపాధ్యాయులు మంచి విద్యాబుద్ధులతో పాటు క్రమ శిక్షణ నేర్పించి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని ఓర్వ కల్లు జెడ్పీ పాఠశాల హెచ్‌ఎం రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఆ పాఠశాలలో పనిచేసిన ఐదుగురు ఉపాధ్యాయులు శ్యామ లమ్మ, రామాంజనేయులు, చంద్రశేఖర్‌రాజు, భాస్కర్, షంషున్నీషా బదిలీపై వెళ్తున్న సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం వారిని సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, కార్యాలయ సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

మురుగు కాలువలు నిర్మించాలి



డ్రైనేజీ లేకపోవడంతో నిలిచిన మురుగును చూపిస్తున్న సీపీఐ నాయకులు

కల్లూరు: కల్లూరు పరిధిలోని 33వ వార్డులో డ్రైనేజీ కాలువలు నిర్మించాలని సీపీఐ నగర సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సీపీఐ నాయకులు కల్లూరు ఎస్టేట్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా నాయకులు శ్రీనివాసరావు మాట్లాడుతూ 33వ వార్డులోని కల్లూరు ఎస్టేట్‌కు వెళ్లే దారిలో డ్రైనేజీ కాలువలు లేక మురుగునీరు రోడ్లపైకి వస్తుందన్నారు. దీంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు రామాంజనేయులు, రబీయా, కృష్ణ నాయక్ పాల్గొన్నారు.

ట్రేడ్ లైసెన్స్ వసూళ్లలో సిబ్బంది నిర్లక్ష్యం

- మొత్తం బకాయిలు రూ.3.27 కోట్లు
- ప్రజారోగ్య విభాగంపై కమిషనర్ సీరియస్
- 17 మంది శానిటరీ ఇన్‌స్పెక్టర్లు
- 132 మంది సచివాలయాల ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు



నగరపాలక సంస్థ కార్యాలయం

కర్నూలు (టౌన్): నగరపాలక పారిశుద్ధ్య విభాగంలో ట్రేడ్ లైసెన్సుల ఆదాయం కీలకం. నగరపాలక సంస్థ పరిధిలో వ్యాపారం చేసుకునే వ్యాపారులు తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్సులు తీసుకోవాలి. ప్రతి ఏడాది రెన్యూవల్ చేసుకోవాల్సి ఉంటుంది. ఈ మొత్తాన్ని వసూలు చేయాల్సిన బాధ్యత ఆయా శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయాల వార్డు శానిటేషన్, ఎన్విరాన్‌మెంట్ కార్యదర్శులదే. ప్రతి ఏడాది ఆర్థిక సంవత్సరం ముగిసే సమయంలో వ్యాపారుల నుంచి ట్రేడ్ లైసెన్సుల రుసుం తప్పనిసరిగా వసూలు చేయాల్సి ఉంటుంది. లేకుంటే నోటీసులు జారీ చేస్తారు. అవసరమైతే ట్రేడ్ లైసెన్సులు రద్దు చేస్తారు. షాప్ సీజ్ సైతం చేస్తారు. ఇలా బకాయిల వసూళ్లలో పారిశుద్ధ్య విభాగంలోని శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, వార్డు సచివాలయాల ఉద్యోగులు నిర్లక్ష్యం వహిస్తున్నారంటూ గురువారం కార్పొరేషన్‌లోని 17 మంది శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, 132 మంది సచివాలయాల ఉద్యోగులకు నగరపాలక కమిషనర్ యస్.రవీంద్రబాబు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. మూడు రోజుల వ్యవధిలో తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్సుల వసూళ్లలో జాప్యానికి కారణాలు తెలియజేయాలని లేనిపక్షంలో శాఖపరమైన చర్యలు తీసుకుంటామని ఆ నోటీసుల్లో పేర్కొన్నారు.

పేరుకుపోయిన బకాయిలు

నగరపాలక ఆరోగ్యశాఖలో ప్రజారోగ్య శాఖ అధికారి, శానిటరీ సూపర్ వైజర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, వార్డు శానిటేషన్ ఉద్యోగులు ఉన్నా ట్రేడ్ లైసెన్సులు సక్రమంగా వసూలు కావడం లేదు. ఈ విభాగంలో ఏ ఏడాది కూడా వంద శాతం ట్రేడ్ లైసెన్సుల రుసుం వసూలు చేసిన దాఖలాలు లేవు. ఇప్పటికే 136 సచివాలయాల పరిధిలో రూ.2,73,85,320 పాత బకాయిలు ఉన్నాయి. ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.53,31,889 బకాయిలు ఉన్నాయి. అరియర్స్, ప్రస్తుత ఏడాది కలుపుకొని రూ.3,27,17,209 బకాయిలు ఉన్నాయి. ఇంత మొత్తంలో వసూళ్లు చేయడంలో పూర్తి స్థాయిలో సిబ్బంది ఉన్నా.. ఒక వైపు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మరోవైపు వార్డు సచివాలయాల ఉద్యోగులు ప్రత్యేక దృష్టి పెట్టడం లేదు. తమకు సర్వేల పేరుతో ఇతరాత్ర పనులు అప్పగించడం వల్ల వీటిపై దృష్టి పెట్టడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాపోతున్నారు. ఒక సచివాలయ ఉద్యోగికి ఒక పని ఇస్తే చేస్తారు కానీ.. అన్ని పనులు నెత్తిన పెడితే ఏలా అంటూ చెబుతున్నారు. ఇక శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఉదయం, మధ్యాహ్నం మస్టర్ వేయడం, మురుగు కాల్వల శుభ్రం, ఇంటింటి చెత్త సేకరణ వంటి పనులకే పరిమితం అవుతున్నారు. అందువల్లే నగరపాలక సంస్థకు రావాల్సిన రూ.కోట్ల ఆదాయం సక్రమంగా వసేలు కావడం లేదన్న విమర్శలు ఉన్నాయి.

శాకంబరీ నమోస్తుతే



శాకంబరీ అలంకరణలో నిమిషాంబ దేవి



అమ్మవారి పూజలో భక్తులు

కర్నూలు కల్చరల్: ఓల్డ్‌సిటీ చిత్తారి వీధిలోని నిమిషాంబ దేవి ఆలయంలో ఆషాఢ మాసం శుక్రవారం పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిమిషాంబ దేవిని వివిధ రకాల కూరగాయలతో శాకాంబరీ దేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. లలితా సహస్రనామ పారాయణం, సామూహిక కుంకుమార్చనలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను వితరణ చేశారు. అమ్మవారి అలంకరణకు ఉపయోగించిన కూరగాయలతో తయారు చేసిన అన్న ప్రసాదాన్ని శనివారం మధ్యాహ్నం 1 గంటకు వితరణ చేయడం జరుగుతుందని కమిటీ సభ్యులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి



మృతిచెందిన గుర్తు తెలియని వ్యక్తి

కర్నూలు: కర్నూలు శివారు గుత్తి పెట్రోల్ బంకు సమీపంలోని రామచంద్ర నగర్ వెల్‌కమ్ సూపర్ మార్కెట్ ఎదురుగా ఎన్‌హెచ్44 జాతీయ రహదారిపై శుక్రవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. బెంగళూరు నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తలకు బలమైన గాయా లై చనిపోయాడు. సుమారు 40 సంవత్సరాల వయ స్సు ఉండి 5.3 అడుగుల ఎత్తు, నలుపు వర్ణం ఉంటాడు. రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందినట్లు స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు ట్రాఫిక్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. నలుపు, తెలుపు చారలు గల షర్టు, నల్లటి జీన్స్ ప్యాంటు ధరించాడు. కుడి చేతికి స్టీల్ కడియం, కుడి మోచేతి కింద నల్లటి పుట్టుమచ్చ ఉంది. అలాగే కుడి మోచేతి కింద హిందీలో అమ్రేష్ పాల్ అని రాసి ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీ కేంద్రానికి తరలించి ట్రాఫిక్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసినవారు 91211 01078కు ఫోన్ చేసి సమాచారం అందించాలని సీఐ మన్సూరుద్దీన్ విజ్ఞప్తి చేశారు.

ఆర్టీఈ అడ్మిషన్ల సమావేశం రసాభాస



విద్యార్థి సంఘాల నాయకులు, ఎంఈఓల మధ్య వాగ్వాదం

కర్నూలు (సిటీ): విద్యా హక్కు చట్టం ప్రకారం కార్పొరేట్, ప్రైవేటు స్కూళ్లలో ఉచిత విద్యకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు అడ్మిషన్ ఇచ్చే విషయంలో పేరెంట్స్, ప్రైవేట్ స్కూళ్లకు మధ్య వివాదం నెలకొంది. చట్ట ప్రకారం విద్యార్థులకు కేటాయించిన స్కూళ్లలో అడ్మిషన్ చేసుకోవాలనే అంశంపై శుక్రవారం మాంటిస్సోరి స్కూల్‌లో డీఈఓ ప్రైవేటు స్కూళ్ల యజమానులు, ఎంఈఓలతో సమావేశం నిర్వహించారు. డీఈఓ మాట్లాడుతూ.. విద్యా హక్కు చట్టం 12(1)సి ప్రకారం విద్యార్థుల కు కేటాయించిన స్కూళ్లలో చేర్పించుకోవాలన్నారు. ప్రభుత్వం నుంచి రావలసిన బకాయిలపై త్వరలోనే సానుకూల నిర్ణయం వస్తుందన్నారు. ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ సమావేశం జరుగుతుండగానే విద్యార్థి సంఘాల నాయకులు, పేరెంట్స్ కల్పించుకుని మొదటి విడత, రెండో విడతలో సీట్లకు ఎంపికైన విద్యార్థులకు అడ్మిషన్లు కల్పించాలని డీఈఓను కోరారు. ఓ విద్యార్థి సంఘం నాయకుడు మాట్లాడుతూ.. కల్లూరు ఎంఈఓ తన మండల పరిధిలో సీట్లకు ఎంపికైన వారందరికీ అడ్మిషన్లు ఇప్పించామని చెబుతున్నారని, వాస్తవానికి పది శాతం మందికి కూడా అడ్మిషన్లు ఇవ్వలేదని ప్రస్తావించారు. ఈ విషయంపై ఎంఈఓ, విద్యార్థి సంఘాల నాయకుల మధ్య మాటామాటా పెరిగి రసాభాసగా మారింది. దీంతో చాలా స్కూళ్లకు చెందిన ప్రతినిధులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. డీఈఓ కల్పించుకుని ఇరువురిని శాంతింపజేసే ప్రయత్నం చేశారు. అనంతరం ఒక్క నిమిషంలోనే సమావేశం ముగిసింది.


ఉమ్మడి భూములను కాపాడుకుందాం!



మాట్లాడుతున్న డ్వామా అదనపు పీడీ మాధవీలత

కర్నూలు(అగ్రికల్చర్): ప్రభుత్వ భూములను దురాక్రమణల నుంచి కాపాడవలసిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని జిల్లా నీటి యాజమాన్య సంస్థ అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ మాధవీలత స్పష్టం చేశారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ సెమినార్ హాల్‌లో అపార్డు, ఎఫ్ఈఎస్ సంస్థలు సంయుక్తంగా నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమానికి అదనపు పీడీ ముఖ్య అతిథిగా హాజరై ఉమ్మడి భూముల పరిరక్షణ, అభివృద్ధి అవశ్యకతను వివరించారు. ఎన్ఆర్ఈజీఎస్ మార్గదర్శకాలకు లోబడి ఉమ్మడి భూములను ఉపాధి నిధులతో అభివృద్ధి చేసే అవకాశం ఉందని, ఇందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఉమ్మడి భూములు అక్రమణలకు గురవుతున్న నేపథ్యంలో అపార్డు సంస్థ వాటి పరిరక్షణకు ముందుకు రావడం అభినందనీయన్నారు. అన్ని ప్రభుత్వ శాఖలు చొరవ తీసుకుంటేనే ఉమ్మడి భూముల పరిరక్షణ, అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. అపార్డు చైర్మన్ తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. కర్నూలు జిల్లాలోని 226, నంద్యాల జిల్లాలో 68 గ్రామాల్లో ఉమ్మడి వనరుల అభివృద్ధి సమితిలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కర్నూలు జిల్లాలో 65,146 ఎకరాలు, నంద్యాల జిల్లాలో 32,638 ఎకరాలను ఉమ్మడి భూములుగా గుర్తించినట్లు తెలిపారు. అపార్డు చొరవ వల్ల 10 మండలాల్లో తహసీల్దార్లు 24,774 ఎకరాల భూములు అక్రమణలకు గురికాకుండా నిషేధిత భూముల జాబితాలో పెట్టారని పేర్కొన్నారు. ప్రభుత్వ భూముల పరిరక్షణలో ఏపీ శాఖ పాత్ర ఎంత అనే దానిని వివరించారు. డ్వామా పరిపాలన అధికారి విజయలక్ష్మి, వ్యవసాయ శాఖ అగ్రానమీ ఏడీఏ రాజశేఖర్, పశుసంవర్ధక శాఖ ఏడీ మల్లన్న, హార్టికల్చర్ ఆఫీసర్ అనూష, ఎఫ్ఈఎస్ ప్రతినిధి భక్తర్ అలీసాబ్ తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్ సాగుకు సమాయత్తం



సుగాలిమెట్ట వద్ద బోర్ల కింద సాగు చేస్తున్న వరి నారు

పాణ్యం: రైతులు ఖరీఫ్ సాగుకు సమాయత్తమవుతున్నారు. వర్షాలు సంవృద్ధిగా కురవకపోయిన బోర్ల కింద వరి సాగు చేసుకునేందుకు సిద్ధమవుతున్నారు. వరినారు కోసం రైతులు దాదాపు పది రోజుల క్రితం వరి విత్తనాలు చల్లారు. ఇప్పుడు నారు ఏపుగా పెరిగిపోవడంతో నాట్లు వేసే పనుల్లో నిమగ్నమయ్యారు. అయితే, వర్షం పడకపోవడం, గోరుకల్లు రిజర్వాయర్ నుంచి నీటి విడుదల లేకపోవడంతో ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. పాణ్యం, సుగాలిమెట్ట, కొండజుటూరు, గోరుకల్లు, ఆలమూరు, కొణిదేడు, గోనవరం, వడ్డుగండ్ల గ్రామాల్లో కొందరు బోర్ల కింద వరి నారు సాగు చేస్తున్నారు.

గాడిదను ఢీకొన్న బస్సు



పాణ్యం: మండల కేంద్రమైన పాణ్యంలోని జాతీయ రహదారిపై సాయిబాబా గుడి వద్ద గాడిదను కర్నూలు వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ఘటనలో గాడిద తీవ్రంగా గాయపడి లేవలేకపోయింది. గమనించిన వాహనదారులు, బాటసారులు చలించి హైవే పోలీసులకు సమాచారమిచ్చారు. వారు వెంటనే అక్కడికి చేరుకుని గాయపడిన గాడిదను పక్కకు తీశారు. చికిత్స నిమిత్తం పశువైద్యాధికారులకు సమాచారం అందించినట్లు చెప్పారు.

పక్కాగా చెత్త సేకరణ



చెత్త సేకరణను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి

కల్లూరు: గ్రామాల్లో పక్కాగా చెత్త సేకరణ జరగాలని జిల్లా పరిషత్ సీఈఓ నాసరరెడ్డి అన్నారు. శుక్రవారం కల్లూరు మండలం చిన్నటేకూరు గ్రామంలో జరుగుతున్న చెత్త సేకరణను ఆయన పరిశీలించారు. గ్రామాల్లో సేకరించిన చెత్తను చెత్త సంపద కేంద్రాన్ని(ఎస్‌డబ్ల్యూపీసీ)కి తరలించాలన్నారు. తడి చెత్త, పొడి చెత్తను వేరు వేరుగా అందించాలని సూచించారు. ఎక్కడ పడితే అక్కడ ప్రజలు చెత్తను వేయరాదన్నారు. దీనిపై వారికి అధికారులు అవగాహన కల్పించాలని సూచించారు. సేకరించిన చెత్త నుంచి చెత్త సంపద కేంద్రాల్లో వర్మీకంపోస్టును తయారు చేయాలన్నారు. అనంతరం చిన్నటేకూరు గ్రామ సచివాలయంలో ఎంపీడీఓ నాగేశ్వాచలరెడ్డి, డిప్యూటీ ఎంపీడీఓ నాగేష్, పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు.

నేటి నుంచి సచివాలయ ఉద్యోగులకు బదిలీలు

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ పరిధిలో సచివాలయాల ఉద్యోగుల బదిలీలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ నెల 28 నుంచి రెండు రోజుల పాటు బదిలీలు చేపట్టనున్నారు. ఈనెల 30వ తేదీలోపు ఈ ప్రక్రియ పూర్తి చేయాలని ఇప్పటికే ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో శనివారం సుంకేసుల రోడ్డులోని నగరపాలక నూతన కౌన్సిల్ హాలులో ఉదయం 8 గంటల నుంచి 10.30 గంటల వరకు వార్డు శానిటేషన్, ఎన్విరాన్‌మెంట్ కార్యదర్శులకు మధ్యాహ్నం 11 గంటలకు, మధ్యాహ్నం 1.30 గంటల వరకు వార్డు ఎడ్యుకేషన్, డేటా ప్రాసెసింగ్ కార్యదర్శులకు అలాగే సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 7.30 గంటల వరకు వార్డు వెల్ఫేర్, డెవలప్‌మెంట్ కార్యదర్శులకు బదిలీల కౌన్సెలింగ్ ఉంటుంది. అలాగే ఈనెల 29వ తేదీ ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు వార్డు ప్లానింగ్, రెగ్యులేషన్ కార్యదర్శులకు, మధ్యాహ్నం 11.30 గంటల నుంచి 1.30 గంటల వరకు వార్డు ఎమినిటీస్ కార్యదర్శులకు బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు నగరపాలక అధికారులు శుక్రవారం వెల్లడించారు. బదిలీల ప్రక్రియలో నంద్యాల, నందికొట్కూరు, ఆదోని, గూడూరు, ఎమ్మిగనూరు మున్సిపల్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్, సిటీ ప్లానర్, మున్సిపల్ ఆరోగ్యశాఖ అధికారి, సూపరింటెండెంట్లు పాల్గొననున్నారు.

నియామకం

కర్నూలు(సెంట్రల్): రాష్ట్ర కాంగ్రెస్ మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడిగా పగిడాల అమానుల్ల నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయనకు మాజీ ఎమ్మెల్సీ సుధాకరబాబు నియామక పత్రాన్ని అందజేశారు.

అట్రాసిటీ కేసులో వ్యక్తి అరెస్టు

కర్నూలు: ఆర్యవైశ్య సంఘం నాయకుడు కర్నూలు నగరానికి చెందిన జయంతి వెంకటేశ్వర్లు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో అరెస్టయ్యారు. షరాఫ్ బజార్‌లోని 16వ నంబర్ దుకాణం యజమాని శరత్‌చంద్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో జయంతి వెంకటేశ్వర్లుపై దౌర్జన్యం కేసు, విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు, న్యాయవాది రవికుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. జయంతి వెంకటేశ్వర్లు ఈనెల 14వ తేదీన తనతో గొడవ పెట్టుకుని జేబు నుంచి బలవంతంగా రూ.20 వేలు లాక్కున్నాడని శరత్‌చంద్ర, అదే సందర్భంలో వారించడానికి వెళ్లిన తనను కులం పేరుతో దూషించాడని రవికుమార్ రెండో పట్టణ పోలీసులకు గురువారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి రాత్రి అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి ఆత్మహత్య

కర్నూలు: నీటిపారుదల శాఖలో ఔట్ సోర్సింగ్ కింద పనిచేస్తున్న కర్రె మహేశ్వరయ్య (59) అనారోగ్యంతో విరక్తి చెంది పురుగు మందు తాగి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతిచెందాడు. ఈయనకు ఐదేళ్ల క్రితం ఓపెన్ హార్ట్ సర్జరీ చేశారు. అప్పటినుంచి అనారోగ్యంతో బాధ పడుతుండేవాడు. ఆస్తమా కూడా సోకడంతో ఇక తన ఆరోగ్యం కుదుటపడదని కలత చెంది గురువారం సాయంత్రం ఇంటి మిద్దెపై పురుగు మందు తాగి అపస్మారక స్థితిలో పడిఉండగా కుటుంబ సభ్యులు గుర్తించి ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక శుక్రవారం మృతిచెందాడు. ఈయనకు భార్య సరస్వతి, కొడుకు, కూతురు సంతానం. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నారు.

గట్టయ్య నగర్ స్కూల్‌ను కొనసాగించాలి

కర్నూలు (సిటీ): కల్లూరు మండలం గట్టయ్య నగర్ ప్రాథమిక పాఠశాలను యథాతథంగా కొనసాగించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రులు శుక్రవారం డీఈఓ శామ్యూల్‌పాల్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా పేరెంట్స్ మాట్లాడుతూ.. గత 40 సంవత్సరాల నుంచి కల్లూరు మండలం గట్టయ్య నగర్ ప్రాథమిక పాఠశాల ఉందని 50 మంది విద్యార్థులు అక్కడ చదువుతున్నారన్నారు. 3, 4, 5 తరగతులను ఒక కిలోమీటర్ దూరంలో ఉన్న కస్తూరి నగర్ పాఠశాలకు తరలించడం అన్యాయమని, ఆ నిర్ణయాన్ని తక్షణమే రద్దు చేయాలని కోరారు. గట్టయ్య నగర్ స్కూల్ నుంచి కస్తూరి నగర్ పాఠశాలకు కిలోమీటర్ దూరం ఉందని, రోడ్లు సరిగా లేవని, పారం చెట్లు ఉన్నాయని, పాములు తిరుగుతుంటాయని, ఆడపిల్లలకు రక్షణ ఉండదని డీఈఓ దృష్టికి తీసుకెళ్లారు. 3, 4 తరగతుల బదిలీని ఆపకపోతే విద్యార్థులు, తల్లిదండ్రులతో చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని చేపడతామన్నారు. స్పందించిన డీఈఓ ప్రభుత్వ పాలసీ విధానం ప్రకారం చేశామని, విలీనం చేసిన తరగతులను రద్దు చేసి తిరిగి అదే పాఠశాలకు తీసుకొచ్చేందుకు తన పరిధిలో ఏం లేదని, మరోసారి పరిశీలించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. డీఈఓకు వినతిపత్రం ఇచ్చిన వారిలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి జె.నాగేశ్వరరావు, సీఐటీయూ మండల నాయకులు సుధాకరప్ప, ఏసు, తల్లిదండ్రులు వెంకటలక్ష్మి, గౌరి, భారతి, సుశీల, రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పెంపుపై కసరత్తు



నన్నూరులో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ విద్యాసాగర్

ఓర్వకల్లు: మండలంలోని వివిధ గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల పెంపుదలపై రెవెన్యూ అధికారులు కసరత్తు చేశారు. శుక్రవారం తహసీల్దార్ విద్యాసాగర్ నన్నూరు, హుసేనాపురం, ఓర్వకల్లు, ఉయ్యాలవాడ గ్రామాల్లో పర్యటించారు. ఆయా పోలింగ్ కేంద్రాల పరిధిలో గల ఓటర్ల శాతాన్ని పరిశీలించారు. 2011 జనాభా ప్రాతిపదికన ఒక్కో కేంద్రంలో వెయ్యి ఓటర్ల చొప్పున మొత్తం 51 కేంద్రాలను ఏర్పాటు చేశారన్నారు. ప్రస్తుతం మండలంలోని ఉయ్యాలవాడ, హుసేనాపురం, నన్నూరు గ్రామాల్లో వెయ్యి ఓటర్ల కంటే అధికంగా వుండడంతో ఆయా గ్రామాల్లో కొత్తగా 6 పోలింగు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తహసీల్దార్ పేర్కొన్నారు. దీంతో మండలంలో మొత్తం 57 కేంద్రాలు అవుతాయన్నారున కార్యక్రమంలో ఆయా గ్రామాల వీఆర్‌ఓలు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వెంకటనారాయణ, స్థానిక నాయకులు విజయుడు, షంషుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

క్షయ పరీక్షలను సద్వినియోగం చేసుకోండి



క్రిష్ణదొడ్డిలో క్షయ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

సి.బెళగల్: గ్రామాల్లో ఉచితంగా నిర్వహిస్తున్న క్షయ వ్యాధి (టీబీ) పరీక్షలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సి.బెళగల్ పీహెచ్‌సీ డాక్టర్ మిధున్‌కుమార్‌రెడ్డి సూచించారు. శుక్రవారం టీబీ నివారణ కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని క్రిష్ణదొడ్డి గ్రామంలో డాక్టర్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బందితో డివిజన్ టీబీ సూపర్‌వైజర్ నాగమహేంద్ర అవగాహన ర్యాలీ, టీబీ నిర్ధారణ పరీక్షలను నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలతో డాక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉచితంగా టీబీ పరీక్షలను నిర్వహించడంతో పాటు వ్యాధి నిర్ధారణ అయినవారికి వైద్యం, ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు చెప్పారు. పరీక్షలు చేయించుకునేందుకు ప్రజలు ముందుకు రావాలన్నారు. టీబీ సూపర్‌వైజర్ నాగమహేంద్ర మాట్లాడుతూ.. ప్రతి గ్రామ పంచాయతీలో ఉచితంగా టీబీ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, 60 సంవత్సరాల పైబడి వయస్సు ఉండి, బీపీ, షుగర్, ఆయాసం, దగ్గు లక్షణాలు ఉన్నవారికి గళ్ల పరీక్షలు నిర్వహించి, టీబీని నిర్ధారించడం జరుగుతుందన్నారు. వ్యాధి నిర్ధారణ అయిన వారికి ఆరు నెలలపాటు ఉచితంగా మందులు, పోషకాహారం కోసం ప్రతి నెలా రూ.1000 చొప్పున చెల్లించడం జరుగుతుందని ఆయన తెలియజేశారు. హెల్త్ సూపర్‌వైజర్ మంగమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జీవాలకు నట్టల నివారణ మందు వేయించాలి



గొర్రెలకు నట్టల నివారణ మందు తాపుతున్న పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు శ్రీనివాస్

కోడుమూరు రూరల్: గొర్రెల పెంపకందారులంతా తమ జీవాలకు నట్టల నివారణ మందు తాపాలని పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు శ్రీనివాస్ సూచించారు. శుక్రవారం కోడుమూరులో గొర్రెలు, మేకలకు సామూహికంగా నట్టల నివారణ మందు వేసే కార్యక్రమానికి పశువైద్య సిబ్బంది శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు శ్రీనివాస్, గొర్రెల పెంపకందారుల సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు కేపీ.శ్రీనివాసులు, డైరెక్టర్ మద్దిలేటి పాల్గొన్నారు. సంయుక్త సంచాలకులు శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఈ నెల 26 నుంచి జూలై 10వ తేదీ వరకు సామూహికంగా గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు తాపే కార్యక్రమాన్ని జిల్లావ్యాప్తంగా చేపట్టడం జరిగిందని, పెంపకందారులంతా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సంఘం అధ్యక్షుడు కేపీ.శ్రీనివాసులు మాట్లాడుతూ.. గొర్రెలను పొలాల్లో ఉంచి కాపలాదారులు వెళ్లినప్పుడు కుక్కలు దాడి చేసి విలువైన గొర్రె పిల్లలను చంపేస్తున్నాయని, దీనివల్ల పెంపకందారులు తీవ్రంగా నష్టపోతున్నారని వాపోయారు. గొర్రెపిల్లలు కుక్కల దాడికి గురికాకుండా అవసరమైన నెట్‌లను ప్రభుత్వం ఉచితంగా అందజేయాలని కోరారు. కార్యక్రమంలో పశువ్యాధి నిర్ధారణ కేంద్రం సహాయ సంచాలకులు రామచంద్ర, జిల్లా గొర్రెల పెంపకం అభివృద్ధి అధికారి రవిప్రకాష్‌రెడ్డి, డీడీ దుర్గప్రసన్నబాబు, కోడుమూరు పశువైద్యాధికారి రామసుబ్బారెడ్డి, పశువైద్య సిబ్బంది, గొర్రెల పెంపకందారులు పాల్గొన్నారు.

చెత్తతో వర్మీకంపోస్టు తయారు చేయాలి



కోడుమూరులో ఎస్‌డబ్ల్యూఎం కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ లక్ష్మి

కోడుమూరు రూరల్: గ్రామాల్లో ఇంటింటి నుంచి సేకరించిన తడి, పొడి చెత్తను వేరు చేసి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు (ఎస్‌డబ్ల్యూఎంసీ) తరలించి వర్మీ కంపోస్టు తయారు చేయాలని డీఎల్‌పీఓ లక్ష్మి పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. ఆమె శుక్రవారం మండలంలోని కోడుమూరు, కల్లపరి గ్రామాల్లో పర్యటించారు. కోడుమూరులో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా డీఎల్‌పీఓ మాట్లాడుతూ.. ప్రతి రోజూ ఇళ్ల నుంచి సేకరించిన చెత్తతో వర్మీకంపోస్టు ఎరువును తయారు చేసి రైతులకు విక్రయించడం ద్వారా పంచాయతీలకు ఆదాయం సమకూర్చుకోవాలన్నారు. అలాగే గ్రామాలను శుభ్రంగా ఉంచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా జగన్నాథ రథయాత్ర





ప్రత్యేక అలంకరణలో జగన్నాథ్, సుభద్ర, బలదేవ్‌మూర్తులు, కృష్ణ శ్రవణంలో పాల్గొన్న భక్తులు



జగన్నాథ రథయాత్ర

కర్నూలు కల్చరల్: శ్రీ జగన్నాథ రథయాత్ర వైభవోపేతంగా జరిగింది. కర్నూలు ఇస్కాన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక భగీరథ కాంప్లెక్స్‌లోని పూరి జగన్నాథ మందిరంలో వేడుక ఘనంగా జరిగింది. జగన్నాథ్, సుభద్ర, బలదేవ్ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం ఇస్కాన్ మందిరంలో దేవతా మూర్తులకు రథయాత్ర నిర్వహించారు. హరే రామ.. హరే కృష్ణ నామ సంకీర్తన చేశారు. భక్తుల ఆధ్యాత్మిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. స్వామివారికి రాజభోగ నివేదన చేశారు. ఇస్కాన్ బాధ్యులు రఘునందన సేవక ప్రభు సందేశమిచ్చారు. ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.